# చైతూ నిశ్చితార్థ శోభితం





హీరో నాగచైతన్య, నటి శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం గురువారం ఉదయం 9గం.42 నిమిషాలకు ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని అగ్ర నటుడు నాగార్జున నివాసంలో ఈ వేడుకను నిర్వహించారు. దీనికి సంబంధించిన ఫొటోలను నాగార్జున సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'ఈ విషయాన్ని మీ అందరితో పంచుకోవడం ఆనందంగా ఉంది. నా కుమారుడు నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం ఈ రోజు జరిగింది. మా అక్కినేని కుటుంబంలోకి ఆమెను సాదరంగా, సంతోషంగా ఆహ్వానిస్తున్నాం. 8.8.8 అనంతమైన ప్రేమకు నాంది. అలాంటి రోజున నిశ్చితార్థం జరుపుకున్న ఈ జంట జీవితం.. సంతోషంతో, ప్రేమతో నిండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా. నూతన జంటకు నా ఆశీస్సులు' అని నాగ్ పేర్కొన్నారు. దీనిపై నెటిజన్స్ కూడా పాజిటివ్‌గా స్పందించారు. కొత్త జంటకు శుభాకాంక్షలు అందించారు. శోభిత, చైతూ కొంతకాలంగా స్నేహితులుగా ఉన్నారు. వీరి పెళ్లి గురించి చాలా రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. అది ఈ రోజు నిజమైంది. ఇక శోభిత వివరాల్లోకెళితే.. గుంటూరు జిల్లా తెనాలిలో ఆమె జన్మించింది. పెరిగింది వైజాగ్. అచ్చ తెలుగమ్మాయి. అమెరికాలో ఉన్నత చదువులు పూర్తి చేసింది. మోడలింగ్ రంగంలో అడుగుపెట్టి 2013 'ఫెమినా మిస్ ఇండియా' టైటిల్ విన్నర్‌గా నిలిచింది. 2016లో అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించిన 'రామన్ రాఘవ్ 2.0' సినిమాతో ఆమె చిత్రరంగ ప్రవేశం చేసింది. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌తోపాటు హాలీవుడ్‌లో కూడా నటించింది. గూఢచారి, మేజర్, పొన్నియన్ సెల్వన్ చిత్రాలు ఆమెకు గుర్తింపును తీసుకొచ్చాయి. ఇక నాగచైతన్య 'తండేల్' సినిమాతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే.

**రెండేళ్లుగా డేటింగ్:** నటి సమంతతో విడాకులు తీసుకున్న అనంతరం నాగచైతన్య కొంతకాలం సింగిల్‌గానే ఉన్నారు. గత రెండేళ్లుగా శోభితా ధూళిపాళ్లతో డేటింగ్ చేస్తున్నారు. 'మేజర్' సినిమా ప్రమోషనల్ కార్యక్రమాల సందర్భంలో ఈ జంట తొలిసారి కలుసుకున్నట్లు తెలిసింది.. అక్కడ చిగురించిన స్నేహం క్రమంగా ప్రేమగా మారింది. గత ఏడాది ఈ జంట లండన్‌లోని ఓ రెస్టారెంట్‌లో కనిపించడంతో డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూరింది. జూన్‌లో విదేశాల్లో కలిసి తీయించుకున్న ఫొటోలు కూడా సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. తాజాగా డేటింగ్ వార్తలను నిజం చేస్తూ ఈ జంట నిశ్చితార్థ వేడుకను జరుపుకున్నారు.

# నా కోసమే రాసినట్టు అనిపించింది



తాప్సీ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించిన చిత్రం 'హసీన్ దిల్‌రుబా'. 2021లో ఓటీటీలో విడులైన ఈ సినిమాను ప్రేక్షకులు బాగా ఆదరించారు. ఇప్పుడీ సినిమాకు కొనసాగింపుగా 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా' రానుంది. ఈ శుక్రవారం సినిమా విడుదల కానుండటంతో తాప్సీ ప్రమోషన్‌లో పాల్గొన్నది. సినిమా గురించి, తన పాత్ర గురించి ఆమె మీడియాతో ఆసక్తికరమైన విషయాలు చెప్పింది. 'తానొక భిన్నమైన కథతో సినిమా చేయాలనుకుంటున్నానని దర్శకురాలు కనికా ధిల్లాన్ చెప్పారు. ఆ కథ నాకు చెబుతారా? అనడిగాను. సమయం చూసి చెబుతానని అన్నారామె. ఆ సమయంలో వేరే సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నా. ఆ షూట్ పూర్తయ్యే సరికి, కనికా ధిల్లాన్ సినిమా పట్టాలెక్కనున్నట్టు వార్తలు వచ్చాయి. దాంతో ఆ కథపై ఆశ వదులుకున్నా. అయితే.. ఓ రోజు నాకు కనికా నుంచి ఫోన్ వచ్చింది. 'ఎందుకు? ఏమిటి? అని ప్రశ్నించొద్దు. స్క్రిప్ట్ నెరేట్ చేస్తాను.. ఆఫీస్‌కి రా' అన్నారు. వెళ్లి విన్నాను. ఈ కథ నా కోసమే రాసినట్టు అనిపించింది. వెంటనే ఒప్పేసుకున్నా. ఇప్పుడు ఆ కథకు సీక్వెల్ చేయడం, అందులోనూ నేనే హీరోయిన్ కావడం చెప్పలేనంత ఆనందంగా ఉంది. మాతృకను మరిపించేలా సీక్వెల్ ఉంటుంది' అని తెలిపింది తాప్సీ పన్ను.



# డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తాం

రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచారపర్వాన్ని వేగవంతం చేశారు. ఈ సినిమాలో బాలీవుడ్ అగ్ర నటుడు సంజయ్‌దత్ ప్రతినాయకుడైన బిగ్‌బుల్ పాత్రను పోషిస్తున్నారు. గురువారం ముంబయిలో జరిగిన కార్యక్రమంలో 'బిగ్‌బుల్' సాంగ్‌ను రిలీజ్ చేశారు. విలన్ పాత్రలను పవర్‌ఫుల్‌గా ప్రజెంట్ చేయడంలో దర్శకుడు పూరి జగన్నాథ్ సిద్ధహస్తుడు. బిగ్‌బుల్ పాట సంజయ్‌దత్ క్యారెక్టర్‌ను ప్రజెంట్ చేస్తూ సాగుతుందని చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా సంజయ్‌దత్ మాట్లాడుతూ..పూరి జగన్నాథ్ తెలుగు సినిమా డైనమిక్స్‌ను మార్చారని, బిగ్‌బుల్‌గా సినిమాలో తన పాత్రను అద్భుతంగా డిజైన్ చేశారని, డబుల్ ఇస్మార్ట్ ప్రేక్షకులకు కావాల్సినంత జోష్‌ను పంచుతుందని అన్నారు. డబుల్ మాస్, డబుల్ ఎనర్జీతో ప్రేక్షకులను అలరించేందుకు వస్తున్నామని హీరో రామ్ పోతినేని తెలిపారు. తాను సంజయ్‌దత్‌కి పెద్ద అభిమానినని, ఆయనతో వర్క్ చేయడం చాలా హ్యాపీగా ఉందని పూరి జగన్నాథ్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మికౌర్.

# భన్వర్‌సింగ్ షెకావత్ రివెంజ్



అల్లు అర్జున్ 'పుష్ప' క్లైమాక్స్ చూసిన ఎవరైనా అనుకునేమాట ఒక్కటే.. 'మన పుష్పరాజ్ పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డాడు' అని. సినిమా అంతా దొంగల్ని కొల్లగొట్టిన గజదొంగలా కనిపిస్తాడు పుష్పరాజ్. కానీ చివర్లో ఓ శాడిస్ట్ పోలీసోడి చేతిలో పడటం ఏదైతే ఉందో.. ఆ పాయింటే 'పుష్ప–2'పై ఆసక్తిని రెట్టింపు చేసింది. క్లైమాక్స్‌లో రెండు సీన్లు మాత్రమే కనిపించినా 'భన్వర్‌సింగ్ షెకావత్' పాత్ర ఎంత ప్రమాదకరమైందో, సెకండాఫ్‌లో పుష్పరాజ్ పడే అవస్థలెలా ఉంటాయో కేవలం ఎక్స్‌ప్రెషన్‌తోనే చెప్పేశాడు మలయాళ అగ్ర నటుడు ఫహాద్ ఫాజిల్. ఇప్పుడు ఇదంతా దేని కంటే.. నేడు ఫహాద్ ఫాజిల్ పుట్టిన రోజు ఈ సందర్భంగా 'పుష్ప 2' నుంచి భన్వర్‌సింగ్‌షెకావత్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. పోలీస్ డ్రెస్‌లో కాకుండా లుంగీ కట్టుకొని మాస్ లుక్‌తో భన్వర్‌సింగ్ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నాడు. ఓ చేతిలో గొడ్డలి, మరో చేతిలో గన్. ఈ స్టిల్‌ని బట్టి.. భన్వర్‌సింగ్ షెకావత్ రివెంజ్‌ని దర్శకుడు సుకుమార్ ఎలా డిజైన్ చేశాడా.. అనే ఆసక్తి ఆడియన్స్‌లో మరింత పెరిగింది. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.
ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్.

# వీరాంజనేయుడి నవ్వుల హంగామా



నరేష్ వీకే, రాగ్ మయూర్, ప్రియా వడ్లమాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హాస్యభరిత చిత్రం 'వీరాంజనేయులు విహారయాత్ర'. అనురాగ్ పలుట్ల దర్శకుడు. బాపినీడు, బి.సుధీర్ ఈదర నిర్మాతలు. ఆగస్ట్ 14న ఈటీవీ విన్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ప్రియాతిప్రియమైన కుటుంబ సభ్యులకు మీ వీరాంజనేయులు ప్రేమతో రాయునది..ఆఖరి కోరికగా కుటుంబం అంతా గోవాలో నా అస్థికలు కలుపుతారని నమ్ముతున్నాను' అంటూ బ్రహ్మానందం వాయిస్ ఓవర్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం నవ్వుల్ని పంచింది. ఫ్యామిలీ ఎమోషన్స్, వినోదం కలబోతగా ఆకట్టుకుంది. నరేష్ తన సహజమైన నటనతో మెప్పించారు. ఈ చిత్రానికి కెమెరా: అంకుర్ సీ, సంగీతం: ఆర్.హెచ్.విక్రమ్, రచన–దర్శకత్వం: అనురాగ్ పాలుట్ల.

# వీరమల్లులో అనుపమ్‌ఖేర్



దేశవ్యాప్తంగా అంచనాలున్న సినిమాల్లో పవన్‌కల్యాణ్ 'హరిహరవీరమల్లు' ఒకటి. చారిత్రక పాత్రలతో కూడిన ఫిక్షన్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మరో అదనపు ఆకర్షణ తోడైంది. దేశంలోని లెజండరీ నటుల్లో ఒకరైన అనుపమ్‌ఖేర్ ఈ సినిమాలో భాగం అయ్యారు. ఇందులో అత్యంత కీలకమైన పాత్రను అనుపమ్‌ఖేర్ పోషించనున్నట్టు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఇందులో అనుపమ్‌ఖేర్, పవన్‌కల్యాణ్ కాంబినేషన్‌లో వచ్చే సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. పవర్‌స్టార్ లైఫ్‌లో ఓ లాండ్‌మార్క్‌గా ఈ సినిమా నిలిచిపోతుందని, యువ దర్శకుడు జ్యోతికృష్ణ అత్యంత బాధ్యతాయుతంగా ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నారని, అన్ని కార్యక్రమాలనూ పూర్తి చేసి త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. నిధి అగర్వాల్, అర్జున్ రాంపాల్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, కళ: తోట తరణి, సమర్పణ: ఎ.ఎం.రత్నం, నిర్మాత: ఎ.దయాకర్‌రావు, నిర్మాణం: మెగా సూర్య ప్రొడక్షన్స్.

# ఇన్నోసెంట్ అబ్బాయి.. గయ్యాళి అమ్మాయి..



'ప్రతి కామన్ ఆడియన్స్‌కు రీచ్ అయ్యే సబ్జక్ట్ ఇది. మన జీవితంలో ఎదురైన సందర్భాల్నీ, పాత్రల్నీ చూసిన ఫీల్ కలుగుతుంది. ఇందులో నా పాత్ర పేరు కార్తీక్. తానో ఇన్నోసెంట్ సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్. పోయి పోయి ఓ గయ్యాళి అమ్మాయిని ప్రేమిస్తాడు. భిన్న వ్యక్తిత్వాలున్న ఈ ప్రేమికుల బంధం ఎలా ముందుకు సాగింది? అనే ప్రశ్నకు సమాధానమే ఈ కథ' అని యువహీరో విజయ్‌శంకర్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'పాగల్ వర్సెస్ కాదల్'. విషిక కథానాయిక. రాజేశ్ ముదునూరి దర్శకుడు. పడ్డాన మన్మథరావు నిర్మాత. శుక్రవారం సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో విజయ్‌శంకర్ మీడియాతో మాట్లాడారు. ''పాగల్ వర్సెస్ కాదల్' అనే టైటిల్ ఈ కథకు పర్‌ఫెక్ట్ యాప్ట్. ఇందులో కొత్తరకం ప్రేమికుల్ని చూస్తారు. విషిక ప్రేక్షకులు ఇంప్రెస్ అయ్యేలా నటించింది. నటిస్తుందా? లేక బిహేవ్ చేస్తుందా? అనే అనుమానం కలిగేంత అద్భుతంగా నటించింది. దర్శకుడు రాజేశ్‌కు ఈ సినిమా తప్పకుండా పెద్ద బ్రేక్ అవుతుంది. సాంకేతికంగా సినిమా అభినందనీయంగా ఉంటుంది.' అని విజయ్‌శంకర్ చెప్పారు.

# గోదావరి నేపథ్య ప్రణయగాథ



అగ్ర హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఆయ్'. అంజి కే మణిపుత్ర దర్శకత్వం వహిస్తున్నారు. బన్నీవాస్, విద్యా కొప్పినీడి నిర్మాతలు. నయన్ సారిక కథానాయిక. ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్ర సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. యు.ఏ.సర్టిఫికెట్ లభించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'గోదావరి నేపథ్యంలో స్నేహం, ప్రేమ, కుటుంబ భావోద్వేగాల కలబోతగా ఈ సినిమా సాగుతుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. తెరపై గోదావరి అందాలను ఆవిష్కరిస్తూ ప్రేక్షకులకు చక్కటి అనుభూతిని పంచే చిత్రమవుతుంది ఆగస్ట్ 15న ఈ చిత్ర పెయిడ్ ప్రీమియర్స్‌ను ప్రదర్శిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సమీర్‌కల్యాణి, సంగీతం: రామ్ మిర్యాల, సమర్పణ: అల్లు అరవింద్, దర్శకత్వం: అంజి కె మణిపుత్ర.

# 'దిల్ రెడ్డి' ప్రారంభం



అంజన్ కస్తూరి, సాంచి బార్తి జంటగా నటిస్తున్న 'దిల్ రెడ్డి' చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో అమ్మగారి రామరాజు (రమేష్) రూపొందిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి సీనియర్ నటుడు తనికెళ్ల భరణి క్లాప్‌నివ్వగా, భరద్వాజ్ కెమెరా స్విఛాన్ చేశారు. దర్శకనిర్మాత అమ్మగారి రామరాజు మాట్లాడుతూ 'లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. తనికెళ్ల భరణిగారు కీలక పాత్రలో కనిపిస్తారు. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల్ని కూడా మెప్పిస్తుంది' అన్నారు. హీరోగా తన తొలి చిత్రమిదని, సకుటుంబసమేతంగా చూసి ఆనందించే కథాంశమని అంజన్ కస్తూరి తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: రామచంద్రరావు, సంగీతం: షారుఖ్‌షేక్, నిర్మాణ సంస్థ: ధీరజ్ ప్రొడక్షన్స్.

# ఊరిలో జాతర చూసినట్లుంది



'ఈ కథ వినగానే తప్పకుండా సినిమా తీయాలని ఫిక్సైపోయా. అంత బాగా నచ్చింది. సిటీలో పుట్టి పెరిగిన నాకు పల్లెటూళ్లలో జరిగే జాతరలు ఎలా ఉంటాయో తెలియవు. కానీ దర్శకుడు యదువంశీ జాతర శోభను కళ్లకుకట్టినట్లుగా చూపించాడు' అని చెప్పింది నిహారిక కొణిదెల. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ పతాకాలపై నూతన తారాగణంతో ఆమె నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా గురువారం నిహారిక కొణిదెల పాత్రికేయులతో పంచుకున్న విశేషాలు..

- పన్నెండేళ్లకు ఓసారి వచ్చే జాతర చుట్టూ ఈ కథ నడుస్తుంది. మూడు తరాలను ఆవిష్కరించే ఈ కథలో హృదయాన్ని కదిలించే భావోద్వేగాలుంటాయి. పదకొండు మంది అబ్బాయిలు అద్భుతమైన పర్‌ఫార్మెన్స్ కనబరిచారు. ప్రేక్షకులు వారి క్యారెక్టర్స్‌తో పర్సనల్‌గా కనెక్ట్ అవుతారు. వారితో కలిసి ప్రయాణం చేస్తారు.
- మా నాన్న ఏదైనా కథ విని నచ్చకపోతే వెంటనే లేచి వెళ్లిపోతారు. కానీ ఈ కథ విని ఆయన చాలా బాగుందని అన్నారు. అన్నావదినలకు కూడా ఈ సినిమా బాగా నచ్చింది. అన్నయ్య వరుణ్‌తేజ్ స్ట్రెయిట్ ఫార్వార్డ్‌గా తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటాడు. ఈ సినిమా చూసి నన్ను అభినందించారు. సెన్సార్ వాళ్లకు కూడా ఈ సినిమా బాగా నచ్చింది.
- ఊళ్లలో పండగలు, జాతరలు, గొడవలు.. ఇలా ఏ విషయమైనా కుర్రాళ్లే ముందుంటారని దర్శకుడు వంశీ చెప్పారు. అందుకే ఆ టైటిల్‌ను పెట్టారు. అనుదీప్ ఇచ్చిన సంగీతం ఈ కథకు ప్రాణం పోసింది. ఇక నటనాపరంగా మంచి కాన్సెప్ట్‌లకు ప్రాధాన్యతనిస్తా. మిగతా అంశాల గురించి పెద్దగా పట్టించుకోను. చిన్న పాత్ర, చిన్న హీరో అని కూడా ఆలోచించను. కథ నచ్చితే నటిస్తా. కేవలం వారసత్వంతో ఇండస్ట్రీలో సక్సెస్ కాలేరు. ప్రతిభతో పాటు సినిమా అంటే ప్రేమ, కష్టపడే తత్వం ఉండాలి. అప్పుడే విజయాలు దక్కుతాయి.




